ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

ఎడిటర్ : నాగేంద్ర పేజీలు : 4 సంపుటి : 1 - సంచిక 231 ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ ఆదివారం 1- 12 - 2024 వెల-6

# రైతులు ఉచ్చులో పడొద్దు



బీఆర్ఎస్ నాయకుల మాయమాటలను
నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దు
గిరిజనులను అడ్డం పెట్టుకొని
లగచర్లలో మంటలు రేపారు
గతంలో భూసేకరణ చేయకుండానే ప్రాజెక్టులు కట్టారా?
ఎవరు అడ్డొచ్చినా కొడంగల్‌కు పరిశ్రమలు తీసుకొస్తా
25 వేల ఉద్యోగాలిచ్చి.. అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా
దేశంలో పది నెలల్లోపే 21 వేల కోట్ల
రుణమాఫీ ఘనత మాదే
సంక్షేమ పథకాల కోసం అప్పులు తేలేదు..
భూములు అమ్మలేదు
అప్పుడు వరి వేస్తే ఉరే అన్నారు..
ఇప్పుడు బోనస్ ఇస్తున్నాం
పాలమూరుకు ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తాం
కేసీఆర్ ఎవరినీ కలవలే.. రేవంతన్నా అంటే పలుకుతున్నా
రైతు సదస్సు ముగింపు సభలో సీఎం రేవంత్‌రెడ్డి
నాలుగో విడత రూ.2747 కోట్ల రుణమాఫీ

వివరాలు 2లో

## పేదలపై ఫీజుల పిడుగు

నిలిచిన 'నామమాత్రం' చెల్లింపులు
విద్యార్థులపై యాజమాన్యాల ఒత్తిళ్లు
విద్యా హక్కు చట్టానికి తూట్లు
బడుగులకు భారంగా కార్పొరేట్ విద్య



కర్నూలు నవంబర్ 30 రిపబ్లిక్ న్యూస్

పేద విద్యార్థులపై ఫీజుల పిడుగు పడింది. విద్యా హక్కు చట్టం ప్రకారం (ఆర్‌టీఈ) ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన వారికి గత ప్రభుత్వం నామమాత్రపు ఫీజు కూడా చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ అంశంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. దీంతో ఫీజు చెల్లించలేక విద్యార్థులు బయటికి వచ్చే దుస్థితి నెలకొంది. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు కార్పొరేట్ విద్య అందని ద్రాక్షగా మారనుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

2లో

## ఇలాంటి కేసులు ఎన్నో చూశాం: గౌతమ్ అదానీ

అమెరికాలో అదానీ గ్రూప్ సంస్థలపై
కేసులు నమోదు
ఇటువంటి కేసులు ఎదుర్కోవడం కొత్త
కాదన్న గౌతమ్ అదానీ
సమస్యలు, దాడులు తమను మరింత
దృఢంగా మార్చుతాయని వెల్లడి

2లో




## బంగ్లాదేశ్ రోగులకు చికిత్స చేయం

: కోల్‌కతాలోని ఆసుపత్రి ప్రకటన
బంగ్లాలో హిందువులపై దాడులు, భారతీయ జెండాకు అవమానం
అందుకే బంగ్లా రోగులకు చికిత్స చేయమన్న జేఎన్ రే ఆసుపత్రి
నిరవధికంగా... చికిత్స చేయబోమని నోటిఫికేషన్




## రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ తత్వం బోధపడినట్లుగా ఉంది: హరీశ్ రావు

కాంగ్రెస్ ఏడాది పాలనలో అన్ని వర్గాలను
ఏడిపించారని విమర్శ
కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల ఫాం హౌస్ ఉందని
నిరూపించగలవా? అని నిలదీత
అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా సమయం
కేటాయించే దమ్ముందా? అని ప్రశ్న

2లో




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ తత్వం బోధపడినట్లుగా ఉందని, అందుకే మళ్లీ తనకు అవకాశం వస్తుందా? అనే ఆందోళన ఆయనలో కనిపిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో అన్ని వర్గాలను

## పెన్షన్ల పంపిణీలో పైసా అవినీతి ఉన్నా ఒప్పుకోను

నేడు ఏపీలో పెన్షన్ల పంపిణీ
రేపు ఆదివారం
కావడంతో ఒక రోజు
ముందుగానే పంపిణీ
అనంతపురం జిల్లా
నేమకల్లు గ్రామంలో
చంద్రబాబు పర్యటన




2లో

ఏపీలో ఒక రోజు ముందుగానే సామాజిక పెన్షన్లు అందజేశారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో, నేడు నవంబరు 30వ తేదీనే ఇంటింటికీ తిరిగి పెన్షన్లు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం జిల్లా నేమకల్లులో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంగా ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు

## రైతులు ఉచ్చులో పడొద్దు

**మహబూబ్‌నగర్,** రైతులు బీఆర్ఎస్ పన్నిన ఉచ్చులో పడొద్దని, ఆ పార్టీ నేతలు చెప్పే మాయమాటలు నమ్మి కేసుల పాలు కావొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. భూసేకరణ చేయకుండా పరిశ్రమల ఏర్పాటు ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. చరిత్రలో ఎక్కడా భూసేకరణ చేయనట్లుగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. వారి హయాంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌కు భూసేకరణ చేయలేదా? అని నిలదీశారు. ఆ సమయంలో తాము కూడా ఇలాగే దాడులు చేసేలా ప్రజలను రెచ్చగొడితే ప్రాజెక్టులు కట్టేవారా? అని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లోపే రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత దేశంలో తమకే దక్కిందన్నారు. శనివారం.. మహబూబ్‌నగర్ సమీపంలోని అమిస్తాపూర్ వద్ద మూడు రోజులుగా జరుగుతున్న రైతు పండుగ ముగింపు ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్న రూ.2 లక్షల రుణమాఫీ కింద రూ.2747 కోట్లను విడుదల చేశారు. భూత్పూరు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన రైతులకు లాంఛనంగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి సీఎం ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో 2 కోట్ల ఎకరాల భూమి ఉందని, కేవలం 1300 ఎకరాలు సేకరించి.. పారిశ్రామికంగా అభివృద్ధి చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇద్దామనుకుంటే. అమాయక గిరిజనులను అడ్డుపెట్టుకొని లగచర్లలో మంటలు రేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌పై, అధికారులపై దాడి చేసే వరకు వివాదం చేశారని ధ్వజమెత్తారు. రైతులు భూములు ఇస్తే తానేమైనా చాపలా చుట్ట చుట్టుకొని కొండారెడ్డిపల్లికో, హైదరాబాద్‌కో తీసుకుపోతానా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందని, హరీశ్‌రావు, కేటీఆర్‌లకు ఫామ్‌హౌసలు ఉన్నాయని తెలిపారు. రైతుకు భూమి తల్లి లాంటిదని, భూసేకరణలో కొంత నష్టం జరిగినా.. రూ.10 లక్షలు కాకపోతే రూ.20 లక్షల చొప్పున ఇస్తానన్నారు. సంతకం పెట్టి ఇంటికి తెచ్చి ఇస్తారని, సహకరించాలని కోరారు. ఇంటికో ఉద్యోగం వస్తే ఒక తరం రాతే మారిపోతుందని తెలిపారు.

## మైనారిటీ సంక్షేమ శాఖ జీవో -47 ఉపసంహరణ

### లవక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

### రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



**అమరావతి నవంబర్ 30( రిపబ్లిక్ న్యూస్ ):** గత ప్రభుత్వ హయాంలో జారీ కాబడిన మైనారిటీ సంక్షేమ శాఖ వక్ఫ్ బోర్డు జీవో -47 ను ఉపసంహరిస్తూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందని రాష్ట్ర న్యాయ,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన జీవోను రద్దు చేస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ జీవో-75 విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు.21.10.2023 న అప్పటి ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఏర్పాటు కోసం నామినేట్ చేయబడ్డ సభ్యుల నియామకాల తీరుపై కొందరు రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎంపిక ప్రక్రియను నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. వివిధ రకాల న్యాయపరమైన సమస్యల తలెత్తిన కారణంగ వక్ఫ్ బోర్డులో పరిపాలన శూన్యత ఏర్పడిందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం జారీ చేసిన, వివాదాస్పదమైన జీవోను రద్దు చేస్తూ నూతనంగా జీవో నెంబర్ 75 ను ప్రభుత్వం శనివారం జారీ చేసిందని మంత్రి ఫరూక్ తెలిపారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ మరియు పరిరక్షణ, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ దిశగానే ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

## మందు బాబులకు అడ్డాగా పశుల ఆసుపత్రి

### మద్యం సీసాలు పగిలి అవస్థ పడుతున్న సిబ్బంది

### లింగాపురంలో మందు బాబుల ఆగడాలు






**బండి ఆత్మకూరు,నవంబర్ 30, (రిపబ్లిక్ న్యూస్):-** మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో కొందరి మందు బాబుల ఆగడాలు రోజురోజుకు మితి మీరి పోతున్నాయి.ఏకంగా గ్రామంలోని పశుల ఆసుపత్రినే అడ్డాగా చేసుకొని రాత్రయితే చాలు అక్కడే మద్యం కొట్టి తాపీగా ఇళ్లకు వెళుతున్నారు.అయితే మందు బాబులు మద్యం తాగిన తర్వాత వారి వెంట తెచ్చుకున్న మద్యం సీసాలు, తిను బండారాల కవర్లు వంటి చెత్తను అక్కడే పడేసి పోవడమే కాకుండా సీసాలు పగల కొట్టడం వల్ల పశు వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుంది.పగిలిన గాజు పెంకులు కుచ్చుకుని గాయాలయ్యే ప్రమాదం ఉందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రతి రోజు రాత్రి ఇక్కడ మద్యం సేవించడం మందు బాబులు పరిపాటిగా మారిందని గ్రామస్తులు తెలిపారు.దీంతో సిబ్బందితో పాటు పశు వైద్యం కోసం వచ్చే పాడి రైతులు అవస్థలు పడుతున్నారని చెప్పారు.ఈ క్రమంలో పశుల ఆసుపత్రి వద్ద మద్యం సేవించే మందు బాబుల ఆగడాలు అరికట్టాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

## ఇలాంటి కేసులు ఎన్నో చూశాం: గౌతమ్ అదానీ

రాజస్థాన్ రాజధాని జైపూర్ లో జరిగిన జెమ్ అండ్ జ్యుయెలరీ అవార్డుల ప్రదానోత్సవంలో అదానీ గ్రూప్ సంస్థల అధినేత గౌతమ్ అదానీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల తమపై అమెరికాలో కేసులు నమోదు కావడం పట్ల ఆయన స్పందించారు. ఇలాంటి కేసులు ఎన్నో చూశామని అన్నారు. అదానీ గ్రూప్ కు ఇలాంటి కేసులను ఎదుర్కోవడం కొత్త కాదని స్పష్టం చేశారు.

ఇలాంటి సమస్యలు, దాడులు తమను మరింత దృఢంగా మార్చుతాయని గౌతమ్ అదానీ పేర్కొన్నారు. మా సంస్థకు ఎదురయ్యే ప్రతి అడ్డంకి ఒక విజయసోపానంగా మారుతుంది అని వ్యాఖ్యానించారు.

భారత్ లో సోలార్ ఎనర్జీ ఒప్పందాలు కుదుర్చుకునేందుకు లంచాలు ఇచ్చినట్టు అదానీ గ్రూప్ సంస్థలపై ఇటీవల ఆరోపణలు రావడం తెలిసిందే. ఈ ఆరోపణలతో అమెరికాలో కేసులు నమోదు కాగా, భారత్ లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది.

## పేదలపై ఫీజుల పిడుగు

విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లలో ప్రవేశాలు కల్పించే నిమిత్తం గత వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసింది. ఆ జీవో బాలల రక్షణ జాతీయ కమిషన్ జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లకు (ఎస్‌వోసీ) విరుద్ధంగా ఉందని స్పష్టం చేసింది. ఆర్‌టీఈ చట్టం ఉద్దేశాన్ని జీవో 24ను నెరవేర్చకపోగా నీరు గార్చేదిగా ఉందని పేర్కొంది. 25 శాతం సీట్ల కోటాలో చేరే పిల్లలకు ఫీజుల నిర్ణయం విషయంలో పిటిషనర్ల భాగస్వామ్యం పక్షాల అభ్యంతరాలు, సూచనలను ప్రభుత్వ పరిగణనలోకి తీసుకోలేదని ఆక్షేపించింది. ఆ జీవోను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిధిలోకి తీసుకోకుండా ఫీజులను ఖరారు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నట్లు తెలిపింది. విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజులను అమ్మఒడి పథకం కింద తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ప్రభుత్వం చెప్పడం చట్టవిరుద్ధంగా ఉందని అభిప్రాయపడింది.

**జిల్లాలో 3,906 మంది అడ్మిషన్లు**

విద్యా హక్కు చట్టం కింద కర్నూలు జిల్లాలో 2022-2023 నుంచి 2024-2025 విద్యా సంవత్సరం వరకు మూడు సంవత్సరాల్లో 25 శాతం సీట్ల కింద మొత్తం 5,634 సీట్లు కేటాయించారు. ఇందులో 3,906 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా 1728 మంది వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరలేదు. 2022-2023 విద్యా సంవత్సరంలో జిల్లాలో 183 సీట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు కేటాయించారు. ఇందులో 158 మంది వివిధ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందగా మరో 25 మంది విద్యార్థులు పాఠశాలల్లో చేరలేదు. అలాగే 2023-2024 విద్యా సంవత్సరంలో 2,119 సీట్లు కేటాయించగా 1395 మంది చేరగా 724 మంది చేరలేదు. 2024-2025 విద్యా సంవత్సరంలో 3,332 సీట్లు కేటాయించారు. 2353 మంది పాఠశాలలో చేరగా 979 మంది అడ్మిషన్లు పొందలేదు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 24ను హైకోర్టు రద్దు చేసింది. ఆర్‌టీఈ చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించాలి. ఆర్‌టీఈ చట్టం కింద అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఏడాదికి ఒక్కొక్క విద్యార్థికి అర్బన్ ప్రాంతంలో రూ.8 వేలు, గ్రామీణ ప్రాంతంలో రూ.6,500, ట్రైబల్ ఏరియాలో రూ.4వేలు మాత్రమే ఫీజులు చెల్లించేలా నిర్ణయించారు.

**పేద విద్యార్థులకు భారంగా మారిన విద్య**

గత ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేయడంతో కార్పొరేట్ విద్య పేద విద్యార్థులకు భారంగా మారింది. పూర్తి ఫీజులు చెల్లించాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. అర్ధాంతరంగా జీవో రద్దు కావడంతో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నెత్తిన పిడుగు పడినట్లయింది. వేలకు వేలు ఫీజులు చెల్లించలేకనే ప్రభుత్వం ఆర్‌టీఈ కింద నామమాత్రపు ఫీజుతో అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తే చేర్పించామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని తాము భారీ మొత్తంలో ఫీజులు ఎలా చెల్లించగలమని ప్రశ్నిస్తున్నారు.

**ఇది అనాలోచిత నిర్ణయం**

గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం తీసుకుంది. ఈ జీవో సరైంది కాదని గతంలోనే చెప్పాం. అయినా బలవంతంగా జీవోను జారీ చేసింది. ఆర్‌టీఈ కింద అడ్మిషన్లు పొందిన పిల్లల ఫీజులు గత ప్రభుత్వం చెల్లించలేదు. ఈ ఏడాది సంబంధించి ఇప్పటి వరకు పైసా కూడా ఇవ్వలేదు. ఈ విద్యార్థులకు సంబంధించిన ఫీజులు ప్రభుత్వం, ఇటు తల్లిదండ్రులు ఇవ్వకపోతే తమ పాఠశాలలు ఎలా నడపాలి. కోర్టు తీర్పును మేం స్వాగతిస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న ఫీజులను ప్రభుత్వం చెల్లించాలి. చట్టం వేరు.. జీవో వేరు.. ఒకదానికొకటి ముడి పెట్టడం ఏమిటి?

**- కర్నూలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ఆపుస్మా) జిల్లా అధ్యక్షుడు బి. వాసుదేవయ్య**

**ఈ విద్యా సంవత్సరానికి కొనసాగేలా చూస్తాం**

విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులపై అదనపు ఫీజుల భారం పడకుండా ఈ విద్యాసంవత్సరం పూర్తయ్యే వరకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర స్థాయి విద్యాశాఖ అధికారులను కోరుతాం. ఆర్‌టీఈ చట్టం కింద చేరిన విద్యార్థులపై ఫీజుల కోసం ఒత్తిడి చేయవద్దని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లకు చెప్పాం. ఇది ప్రభుత్వ నిర్ణయం. రాష్ట్ర స్థాయి అధికారుల ఆదేశాలు వస్తే బావుంటుంది.

## రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ తత్వం బోధపడినట్లుగా ఉంది: హరీశ్ రావు

అని ప్రశ్నించారు. నిరూపించలేని పక్షంలో సీఎం పదవికి రాజీనామా చేయాలని సవాల్ చేశారు. అబద్ధాలు చెబుతూ ఏడాది పాలనలో అన్ని వర్గాలను మోసం చేశారని ఆరోపించారు. ఈ అబద్ధాలతో ఇంకా ఎంతో కాలం మోసం చేయలేవన్నారు.

అసెంబ్లీకి రమ్మని రేవంత్ రెడ్డి తమను తెగ పిలుస్తున్నాడని... ఆ సమయం కోసమే తాము కూడా ఎదురు చూస్తున్నామని చెప్పారు. అసెంబ్లీలో నీ ఏడాది పాలన అసలు రంగు బయట పెట్టేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందన్నారు. అసెంబ్లీలో మైకులు కట్ చేయకుండా సమయం కేటాయించే దమ్ము మీకుందా? అని ప్రశ్నించారు.




## పెన్షన్ల పంపిణీలో పైసా అవినీతి ఉన్నా ఒప్పుకోను

చంద్రబాబు నేమకల్లులో దివ్యాంగురాలు భాగ్యమ్మ ఇంటికి వెళ్లారు. ఆమె కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఆమెకు దివ్యాంగ పింఛను రూ.15 వేలు అందజేశారు. అదే గ్రామంలో రుద్రమ్మ అనే వితంతు మహిళ ఇంటికి కూడా వెళ్లి పెన్షన్ అందజేశారు. ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... ఇద్దరు మహిళల ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్లు అందించానని వెల్లడించారు. ప్రజల్లోని ఆనందం శాశ్వతంగా ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. మెరుగైన పెన్షన్ల ద్వారా వితంతువులు, దివ్యాంగులకు అండగా ఉన్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. "అణగారిన వర్గాలకు అండగా ఉండడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల హామీ మేరకు పెంచిన పెన్షన్లను ఏప్రిల్ నుంచి లెక్కగట్టి ఇచ్చాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెన్షన్లను ప్రవేశపెట్టింది ఎన్టీఆర్. ఇప్పుడు రాష్ట్రంలో 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నాం. పెన్షన్ల రూపంలో ఈ ఐదు నెలల్లో రూ.18 వేల కోట్లు పంపిణీ చేశాం. పెన్షన్ మూడు నెలలకు ఒకసారి కూడా తీసుకునే వెసులుబాటు కల్పించాం. పెన్షను లబ్ధిదారుల్లో కూలీలు, కార్మికులు ఉన్నారనే ఈ సౌకర్యం తీసుకువచ్చాం. దేశంలోనే ఎక్కువ పెన్షన్ ఇచ్చే రాష్ట్రం మనదే. పెన్షన్ల పంపిణీలో పైసా అవినీతి ఉండకూడదని స్పష్టం చేశాను.

పేదలకు అనేక రకాలుగా మేలు చేయాలని ఉంది... కానీ సమస్యలు చాలా ఉన్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనతో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయి. ముందు వాటిని బాగు చేయాల్సి ఉంది" అని సీఎం చంద్రబాబు వివరించారు.

అనంతపురం జిల్లా అంటే నాకు ప్రత్యేకమైన అభిమానం: చంద్రబాబు మీ పంటలకు నీళ్లు ఇస్తానని గతంలో ఇక్కడి రైతులకు హామీ ఇచ్చాను. రాయలసీమను రతనాల సీమగా మార్చుతానని చెప్పాను. మొన్నటి ఎన్నికల్లో ప్రజలంతా ఆలోచించి ఓటేశారు. అనంతపురం జిల్లా అంటే నాకు ప్రత్యేకమైన అభిమానం ఉంది. రాయదుర్గం అంటే చాలా వెనుకబడిన ప్రాంతం. రాయదుర్గం ప్రాంతం ఎడారిగా మారకుండా చర్యలు చేపట్టాం. రాయదుర్గం ప్రజల్లో వెలుగులు నింపే బాధ్యత తీసుకుంటాం.

హంద్రీ నీవాపై రూ.4,500 కోట్లు ఖర్చు చేశాం. రాయలసీమలోని ప్రాజెక్టులకు రూ.12,500 కోట్లు ఖర్చు చేశాం. ఇక్కడున్న నేమకల్లు ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం.

## టీసీఎస్ వచ్చేస్తోంది



**విశాఖపట్నం, అమరావతి,** దిగ్గజ సాఫ్ట్‌వేర్ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) విశాఖపట్నంలో కార్యకలాపాల ప్రారంభానికి మార్గం సుగమమైంది. రుషికొండ ఐటీ పార్కు హిల్-2పై నాన్ సెజ్ ఏరియాలోని 'డల్లాస్ టెక్నాలజీస్' భవనాన్ని లీజుకు తీసుకొని అందులో కార్యాలయం నడపడానికి టీసీఎస్ ముందుకువచ్చింది. లీజు ఒప్పందానికి ఆమోదం తెలుపుతూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో టీసీఎస్ తొలి దశలో రెండు వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది. ఆ తరువాత మరింత విస్తరిస్తుంది. విశాఖపట్నం ఐటీ కేంద్రంగా అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ యాంకర్(పెద్ద) కంపెనీలు లేకపోవడం లోటుగా ఉండేది. దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించి, టాప్ -10 కంపెనీలు వచ్చేలా చేస్తామని ఐటీ మంత్రి నారా లోకేశ్ గతంలో ప్రకటించారు. ఆ మేరకు టీసీఎస్ ప్రతినిధులను విశాఖకు ఆహ్వానించారు. నగరంలోని ఐటీ పార్కుల్లో భవనాలు, భూములు చూసుకోవాలని, ఏమి కావాలంటే అవి సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అయితే తమకు తొలుత భవనమే కావాలని, అది కూడా సెజ్ పరిధిలో ఉండకూడదని టీసీఎస్ ప్రతినిధులు స్పష్టంచేశారు. రుషికొండలో హిల్-2పై డీనోటిఫై చేసిన ప్రాంతంలోని డల్లాస్ టెక్నాలజీ ఎల్ఎల్‌పీ నూతనంగా నిర్మించిన భవనాన్ని ఎంపిక చేసుకున్నారు. ఇది ఇన్ఫోసిస్ పక్కనే ఉండడం గమనార్హం.

**టీసీఎసను ఆకర్షించిన 'డల్లాస్'**


డల్లాస్ టెక్నాలజీస్ కంపెనీకి ఏపీఐఐసీ 2016లో హిల్-2పై 7,774.90 చ.మీ. భూమిని కేటాయించింది. అందులో రెండేళ్ల క్రితం ఆ కంపెనీ భవన నిర్మాణం ప్రారంభించింది. గ్రౌండ్‌౦3 అంతస్థుల భవనం నిర్మించింది. త్వరలో కార్యకలాపాలు ప్రారంభించాలని యోచిస్తోంది. అందులో 1,400 మంది వరకు పనిచేసుకోవచ్చు. ఈ నెల మొదటి వారంలో విశాఖకు వచ్చిన టీసీఎస్ బృందాన్ని 'డల్లాస్' భవనం ఆకర్షించింది. వారితో చర్చలు జరిపారు. లీజుకు ఇవ్వాలని అడిగారు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తే లీజుకు ఇవ్వడానికి డల్లాస్ యాజమాన్యం అంగీకరించింది. అయితే డల్లాస్ భవనంలో సీటింగ్ సామర్థ్యం రెండు వేల మందికి సరిపడా విస్తరించాలని టీసీఎస్ కోరింది. పక్కనే ఖాళీగా ఉన్న భూమిని ప్రభుత్వం కేటాయిస్తే అక్కడ కూడా నిర్మాణం చేపట్టి పూర్తిస్థాయిలో ఇస్తామని డల్లాస్ తెలిపింది. ఇదే విషయాన్ని డల్లాస్ ప్రతినిధులు ప్రభుత్వానికి కూడా తెలియజేశారు. పక్కనే 1,909 చ.మీ. స్థలం ఉందని, అందులో 1,600 చ.మీ. కావాలని, గతంలో చ.మీ. రూ.6,720 చొప్పున కేటాయించారని, అదే ధరకు ఇవ్వాలని కోరారు. భవనం వెనుక సెట్‌బ్యాక్స్ విషయంలో కొంత మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థించారు.

**ఎస్ఐపీబీలో కీలక నిర్ణయం**

డల్లాస్ ప్రతిపాదనలపై ఈనెల 19న ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా టీసీఎసకు భవనాన్ని లీజుకు ఇవ్వడానికి డల్లాసకు అనుమతి మంజూరుచేశారు. నిబంధనల ప్రకారం ఉపాధి కల్పించాలని, పదేళ్లపాటు అది కొనసాగాలని టీసీఎసకు స్పష్టంచేశారు. సెట్ బ్యాక్స్ ప్రయోజనాల కోసం కోరిన స్థలాన్ని మంజూరు చేయాలని దానికి చ.మీ.కు రూ.10 వేలు చొప్పున వసూలు చేయాలని ఏపీఐఐసీకి సూచించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ తక్షణమే భవనాన్ని పరిశీలించి, నిబంధనల ప్రకారం కార్యకలాపాలు ప్రారంభించుకోవడానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీచేయాలని ఆదేశించారు. విశాఖపట్నానికి వస్తున్న తొలి మెగా ఐటీ కంపెనీ కాబట్టి, అది త్వరగా ప్రారంభం కావడానికి అవసరమైన అన్నిరకాల పనులు పూర్తిచేసుకోవడానికి ప్రభుత్వ శాఖలన్నీ సహకరించాలని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఆయా శాఖలకు ఉత్తర్వులు జారీచేశారు. సింగిల్ డెస్క్ పోర్టల్ 2.0 ద్వారా అనుమతులు ఇవ్వాలని సూచించారు.

# హక్కుల మార్గాన్ని అనుసరించండి నా ఆరోగ్యం, నా హక్కు.

**ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ నినాదం.**
**నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం.**
**జిల్లాలో అవగాహన కార్యక్రమాలు.**
**ఎయిడ్స్ మహమ్మారిని 2030కి తరిమి కొట్టడమే లక్ష్యం- అడిషనల్ డిఎంచ్ ఓ డా. శారద**




**నంద్యాల ప్రతినిధి, నవంబర్ 30, రిపబ్లిక్ న్యూస్ ::** 1988వ సంవత్సరంలో డిసెంబర్ 1 వ తేదీన ప్రపంచ ఎయిడ్స్ దినముగా ప్రకటించారు. ప్రపంచ ఎయిడ్స్ దినం హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించడం కోసం , ప్రపంచవ్యాప్తంగా దీనిని ఎదుర్కోవటానికి అందరినీ దగ్గర చేసే ఒక కార్యక్రమం. ఈరోజు ముఖ్యముగా ప్రపంచవ్యాప్తంగా హెచ్ఐవి ఎయిడ్స్ నివారణ కోసం, చికిత్స ,సేవల గురించి వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న దేశాల్లో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టడానికి దీనిని ఒక అవకాశం గా భావించవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు హెచ్ ఐవి వ్యాధితో పోరాడిన వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ హెచ్ఐవి నిరోధకతలో ప్రపంచం సాధించిన ప్రగతిని జరుపుకునే కార్యక్రమాలకు సంఘటనలకు ఈరోజు అంకితం చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్.ఐ.వి కార్యక్రమం ప్రపంచ ఎయిడ్స్ దినం డిసెంబర్ 1న ఒక వేదికగా ప్రపంచవ్యాప్తంగా అందరిని భాగస్వాములు చేయడానికి హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల గ్లోబల్



హెల్త్ సెక్టార్ స్ట్రాటజీ ద్వారా సవాళ్లను అధిగమించడానికి గల అవకాశాలను వెలుగులోకి తెచ్చింది.

హెచ్.ఐ.వి. వైరస్ ఇండియాలో మొట్టమొదటి సారిగా ఒక మహిళ సెక్స్ వర్కర్ లో చెన్నైలో 1986 లో ఫిబ్రవరి నెలలో కనుగొన్నారు. ప్రపంచంలో సుమారు 39.9 మిలియన్ ప్రజలు హెచ్.ఐ.వి. తో జీవిస్తున్నారు. ఇండియాలో సుమారు 25.44 లక్షల ప్రజలు హెచ్.ఐ.వి. తో జీవిస్తున్నారు. ఇండియాలో 2023 నాటికి హెచ్.ఐ.వి. వ్యాప్తి 0.20 శాతంగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ లో సుమారు 3.14 లక్షలమంది హెచ్.ఐ.వి. తో జీవిస్తున్నారని గణాంకాలు అంచనా వేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్లో 2002లో 1.7 శాతం గా ఉన్న హెచ్.ఐ.వి. వ్యాప్తి 2023 నాటికి 0.62 గా నమోదయింది. నంద్యాల జిల్లాలో 2002లో 0.50 శాతము ఉన్న హెచ్.ఐ.వి. వ్యాప్తి 2021 సంవత్సరంలో 0.33 శాతంగా ఉన్నట్లు నాకో- హెచ్.ఐ.వి. సెంటినెల్ సర్వేలెన్స్ సర్వే ప్రకారం తేలింది. 2012 నుండి 2022 వరకు ఉమ్మడి కర్నూల్ జిల్లాలో, 2022 నుండి 2024 అక్టోబర్ వరకు నంద్యాల జిల్లాలో సుమారు 10 లక్షల కు పైగా సాధారణ ప్రజలకు హెచ్ ఐవి పరీక్షలు నిర్వహించగా 18 వేల 676 మంది హెచ్ ఐవి భారిన పడ్డారు. 8 లక్షల 80 వేల మంది గర్భిణీ స్త్రీలకు హెచ్ ఐవి పరీక్షలు నిర్వహించగా 1068 మందికి పాజిటివ్ వచ్చింది.

### జిల్లాలో నిర్ధారణ, ఏఆర్‌టి, సెంటర్లు

పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల, శాంతిరాం వైద్యశాల, జిల్లా పరిధిలో ఆళ్లగడ్డ కోవెలకుంట్ల బనగానపల్లె బేతంచెర్ల డోను ఆత్మకూరు, నందికొట్కూరు సున్నిపెంట, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో వెలుగోడు, మిడుతూరు, పాణ్యం, అవుకు, యాళ్ళూరు ప్రభుత్వ వైద్యశాలలో ఉచిత నిర్ధారణ పరీక్షలు, అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్, వ్యాధి నిరోధక ఔషధాలు ఇవ్వడం జరుగుతుంది. జిల్లాలో 7788 హెచ్ ఐవి బాధితులు ఏఆర్‌టి సెంటర్లలో నమోదు చేసుకోగా 4864 బాధితులకు సుమారు 4 వేల రూపాయల విలువ చేసే మందులను ఉచితంగా ప్రతి నెల ప్రభుత్వం అందచేస్తుంది. ప్రతినెల 401 మంది హెచ్ ఐవి బాధితులు ప్రభుత్వం నుండి పింఛన్ అందుకుంటున్నారు.

### ఎయిడ్స్ మహమ్మారిని 2030 కి తరిమి కొట్టడమే లక్ష్యం- అడిషనల్ డిఎంహెచ్ ఓ, కుష్టు, ఎయిడ్స్, టీబి విభాగాల జిల్లా వైద్యాధికారి డాక్టర్. శారద



ఎయిడ్స్ మహమ్మారిని2030కి తరిమి కొట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం హెచ్ ఐవి వ్యాప్తి నిరోధకతపై ప్రచారం, పరిశోధనలను.ముమ్మరం చేసింది. ప్రతి ఒక్కరు భయపడకుండా ప్రభుత్వ ఉచిత పరీక్ష కేంద్రాలలో హెచ్ ఐవి పరీక్షలను చేయించుకోవాలి. పాజిటివ్ వచ్చిన ఆందోళన చెందకుండా ప్రభుత్వం అందించే ఉచిత చికిత్సను తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చు. రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డా.జి రామకృష్ణారెడ్డి గత 3 సంవత్సరాలుగా ప్రతి నెల 50 మంది హెచ్ ఐవి బాధితులకు 25 వేల రూపాయలతో పౌష్టికాహార కిట్లను అందచేస్తున్నారు. పేద హెచ్ ఐవి బాధితులకు మరింత మంది దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే ఆ కుటుంబాలకు అండగా ఉంటుంది. ఆదివారం మెగా ర్యాలిని ఎయిడ్స్ అవగాహనపై టేక్ ద రైట్ పాత్ నినాదంతో పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల నుండి టెక్కె మార్కెట్ యార్డ్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నాము.

# ఎన్ఫోర్స్మెంట్ పై ప్రత్యేక దృష్టి

**గడిచిన 24 గంటలలో ఎన్ఫోర్స్మెంట్ వివరాలు**
**రోడ్డు ప్రమాదాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు**
**నేర నియంత్రణ శాంతిభద్రతల పరిరక్షనే లక్షంగా విజిబుల్ పోలిసింగ్**
**-జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా**




**నంద్యాల క్రైం, నవంబర్ 30, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో నేర నియంత్రణ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పట్టణ శివారు ప్రాంతాలలో, గ్రామాలలో వల్నరబుల్ ఏరియాలలో గడిచిన 24 గంటలలో పోలీస్ అధికారులు వారి సిబ్బంది సహాయంతో, ప్రతి సబ్ డివిజన్ నందు గల డ్రోన్ కెమెరాల సహాయంతో అసాంఘిక శక్తులకు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని కట్టడి చేయడానికి తీసుకున్న ఎన్ఫోర్స్మెంట్, విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా విస్తృత తనిఖీలు నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలియజేశారు. జిల్లా పోలీసులు రోడ్డు ప్రమాదాలపై విశ్రుతంగా అవగాహన కల్పిస్తున్నా నిభందనలు ఉల్లంఘించిన వారిపై మోటారు వాహన చట్టాన్ని ఉపయోగించి గడిచిన 24 గంటల్లో డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపే 543 మందిని గుర్తించి 2,52,495 రూపాయలను జరిమానా విధించడం జరిగింది. మద్యం సేవించి వాహనాలు నడిపే 21 మందిని గుర్తించి 21 వాహనాలను తదుపరిచర్య నిమిత్తం స్వాధీనం చేసుకోవడం జరిగింది. నేర నియంత్రణ శాంతిభద్రతల పరిరక్షనే లక్షంగా విజిబుల్ పోలిసింగ్ లో భాగంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నేరమని తెలియజేస్తూ గడిచిన 24 గంటలలో 66 కేసులు నమోదు చేయడంతో పాటు బహిరంగ ప్రదేశాలలో ధూమపానం చేయుచున్న వారిపై 51 కేసులు నమోదు చేసి 4290 రూపాయలు జరిమాన విధించడం జరిగింది. ప్రజల జీవితాలను నాశనం చేసే మట్కా ,జూదం మొదలగు వాటిపై దాడులు చెయ్యడం జరిగింది. ఈ దాడులలో డోన్ రూరల్ పోలీసు స్టేషన్ పరిదిలో పోలీసు అధికారులకు రాబడిన సమాచారం మేరకు పేకాట ఆడుచున్న వారిపై దాడి చేసి కేసు నమోదు చెయ్యడంతోపాటు 17 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి తదుపరి చర్య నిమిత్తం రూ. 1,48,200 రూపాయలను స్వాదినం చేసుకోవడం జరిగింది. ఆత్మకూరు సబ్ డివిజన్ నందికొట్కూర్ టౌన్ స్టేషన్ పరిదిలో మట్కా ఆడుచున్న వారిని కనిపెట్టి వారిపై 03 కేసులు నమోదు చేయి ముగ్గురిని అరెస్ట్ చెయ్యడంతోపాటు తదుపరిచర్య నిమిత్తం 3250 రూపాయలను స్వాదినం చేసుకోవడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం పేదకు ఇచ్చే బియ్యాన్ని పక్కదారిన ఎక్కువ దరకు అమ్ముకోవద్దనికి ఆటొలో తరలిస్తుండగా రాబడిన సమాచారం మేరకు డోన్ టౌన్ పోలీసు అధికారులు దాడి చేసి పట్టుకొని కేసు నమోదు చేసి 11 బియ్యం బస్తాలను ఒక ఆటోను తదుపరి చర్య నిమిత్తం స్వాధీనం చేసుకోవడం జరిగింది.



# పాములపాడులో వరల్డ్ ఎయిడ్స్ డే అవగాహన ర్యాలీ.

**పాములపాడు నవంబర్ 30 (రిపబ్లిక్ న్యూస్):-** మండల కేంద్రమైన పాములపాడులో మేరీబా-టీఐ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ ఎయిడ్స్ డే అవగాహన ర్యాలీని జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం- బి.గోపాల్ జండా ఊపి ప్రారంభించారు. ఈ వరల్డ్ ఎయిడ్స్ డే అవగాహన ర్యాలీ జిల్లా పరిషత్ హైస్కూల్ నుండి విద్యార్థులు, ఉపాధ్యాయులు, పిహెచ్సి వైద్యాధికారిణి ఇవి.నాగలక్ష్మి దేవి, ఆయుర్వేద విద్యాధికారిణి డి. సావిత్రి, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి. అంకన్న, జాతీయ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు నల్లమల. అబ్రహం, పోలీస్ కానిస్టేబుల్ ఏ.ఖాజా, హోంగార్డు టీ.మన్సూర్ అలి, మేరీబా-టీ ఐ స్వచ్ఛత సంస్థ ఓఆర్డబ్ల్యు లు-ఎం.రాజు, అరుణ కుమారి, పీఈలు టి.అరుణ, కీర్తి, సేవా భారతి యూత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.షర్ఫుద్దీన్ అలి, గ్రంథాలయ అధికారి సి.వి.కృష్ణారెడ్డి, తదితరులతో కలిసి ఎయిడ్స్ వ్యాధికి మందు లేదు-నివారణ ఒక్కటే మార్గం, ఎయిడ్స్ అంటువ్యాధి కాదు-అంటించుకునే వ్యాధి, ఎయిడ్స్ రోగులను-ఆప్యాయతతో ఆదరిద్దాం అనే నినాదాలతో నగర వీధుల గుండా వెళ్లి, బస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్వహించడం జరిగింది. ఈ మానవహారంలో డాక్టర్లు ఇవి. నాగలక్ష్మి దేవి, డి.సావిత్రి, లు మండల ప్రజలందరి ఎయిడ్స్ కి మందు లేదు నివారణ ఒక్కటే మార్గం, రానున్న రోజుల్లో యువతరం చెడు అలవాట్లకు బానిస కాకుండా, మనమందరం కాపాడటం మన వంతు బాధ్యతగా స్వీకరించాలన్నారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి మనమందరం కలిసికట్టుగా ఒక అడుగు ముందుకు వేసి అక్రమ సంబంధాలకు, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా కాపాడేందుకు ముందుకు రావాలన్నారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవి/ఎయిడ్స్ గురించి తెలుసుకొని జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం హెల్త్ సూపర్వైజర్-ఎం.మద్దయ్య అందరితో ఎయిడ్స్ వ్యాధికి దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్ర మంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాంప్రసాద్, శ్రీనివాసులు, ద్రాక్షాయిని బాయి, రవీంద్ర నాయుడు, భవిత పాఠశాల ఉపాధ్యాయులు శంషుద్దీన్, రామ్మూర్తి, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల కాంపౌండర్ డి. మహబూబ్ బాషా, ప్రాథమిక వైద్యశాల సిహెచ్ఓ జి.అన్నమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ పి.నాగేశ్వరరావు, ఆశ వర్కర్లు విజయ కుమారి, మొగిలీశ్వరమ్మ, వెంగమ్మ, విద్యార్థిని,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# కోవెలకుంట్లలో మెకానిక్ పై ఎక్కిన ఆర్టీసీ బస్సు

**అక్కడికక్కడే మృతి చెందిన మెకానిక్**



**నంద్యాల క్రైం, నవంబర్ 30, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా పరిధిలోని కోవెలకుంట్లలో శనివారం విషాద ఘటన చోటు చేసుకుంది. ఆర్టీసి అద్దె బస్సులో ప్రైవేట్ మెకానిక్ చిన్న వెంకట రమణారావు (గణపతి) బస్సుకు మరమ్మత్తులు చేస్తుండగా ఈ క్రమంలో డ్రైవర్ చూసుకోకుండా బస్సును ముందుకు తరలించడంతో బస్సు చక్రాలు మెకానిక్ తలపై నుంచి వెళ్లాయి. రమణారావు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఆంధ్ర ప్రగతి ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలి

**నంద్యాల నవంబర్ 30 ( రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడపలోని కొనసాగించాలని కోరుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఉద్యోగ సంఘం ప్రాంతీయ కార్యదర్శి సుజిత్ ఆధ్వర్యంలో న్యాయ శాఖ మంత్రి మహమ్మద్ ఫారూఖ్ ను కలిసి ఈ రోజు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామీణ బ్యాంక్ ఉద్యోగ సంఘం ప్రాంతీయ కార్యదర్శి సుజిత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో ఒకే రాష్ట్రం ఒకే గ్రామీణ బ్యాంక్ అన్న నినాదంతో నాలుగు గ్రామీణ బ్యాంకులను కలిపి, ఒకే గ్రామీణ బ్యాంకుగా చేసే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వము ప్రతిపాదిస్తున్నారు. చైతన్య గ్రామీణ బ్యాంకు, ఏపీ వికాస్ గ్రామీణ బ్యాంకు,సప్తగిరి గ్రామీణ బ్యాంకు,ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ లను కలిపి ఒకే బ్యాంకు గా చేస్తున్నందున ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే ఉంచాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లాలని కోరారు. రాష్ట్రం లోనే అతి పెద్ద బ్యాంక్ అయిన ఆంధ్ర ప్రగతి బ్యాంక్ లో మిగతా మూడు గ్రామీణ బ్యాంక్ లను విలీనం చేస్తున్నందున ప్రధాన కార్యాలయంను ప్రస్తుతం కడపలో అన్ని అధునాతన వసతులతో గత 18 సం!! లుగా కొనసాగుతున్నందున దానినే కొనసాగించాలని వారు కోరారు. దక్షిణ భారత దేశం లో కరెన్సి చెస్ట్ ఉన్న ఏకైక కార్యాలయం కడపలో ఉందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. దాని వలన రాయలసీమ ప్రాంతానికి జరిగే నష్టాన్ని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శ్రీనివాస రెడ్డి,రవి తేజ రెడ్డి,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇది ప్రజల సంక్షేమ ప్రభుత్వం..

**ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు తూచా అమలు .**
**ఒక రోజు ముందుగానే పింఛన్లు**
**పంపిణీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్**




**నంద్యాల నవంబర్ 30 ( రిపబ్లిక్ న్యూస్):** ఇది ప్రజల సంక్షేమ ప్రభుత్వమని రాష్ట్ర అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను సగర్వంగా నిర్వహిస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ , మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి మాసం నుంచే ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను పెంచి ప్రతినెలా ఒకటో తేదీన పంపిణీ చేస్తున్నామని అన్నారు. డిసెంబర్ 1 ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే ప్రభుత్వం నవంబర్ 30 నే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు . అందులో భాగంగా శనివారం నంద్యాల నియోజకవర్గం లోని 29 వ వార్డు టిడిపి ఇంచార్జ్ మంజుల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో షాదిక్ నగర నందు మంత్రి ఫరూక్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రజల తరపున మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్ల పెంపు తో పాటు మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించే కార్యక్రమాన్ని కూడా చేపట్టామని తెలిపారు అంతేకాకుండా గత వైసిపి ముఖ్యమంత్రి జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను రద్దుచేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర అధ్వానంగా ఉన్న రోడ్లను కూటమి ప్రభుత్వం బాగు చేయించే కార్యక్రమాన్ని కూడా చేపట్టిందని గుర్తు చేశారు. గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మాణం చేపట్టి పంచాయతీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చూస్తుందని మంత్రి ఫరూక్ తెలిపారు. టీడిపి ఎన్నికల మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను దశల వారీగా ఈ ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. గత ఐదేళ్ల జగన్ మోహన్ రెడ్డి పాలన మొత్తం అవినీతి మయం అన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు, రంగాలను వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 5 మాసాల్లోనే రాష్ట్రంలో అభివృద్ధి ,సంక్షేమం రెండు కళ్ళలా అమలు చేస్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి , కౌన్సిలర్ శ్రీదేవి , వాకా శివశంకర్ యాదవ్ , గుద్దేటి వెంకటేశ్వర్లు , జెపి , బ్యాంక్ తిమ్మయ్య , చాబోలు ఇలియాజ్ , బద్రిశెట్టి రవికుమార్ , నాగరత్నమ్మ , సాయిరాం , జ్యోతి రాయల్ , వేద సాయి , సంపంగి జయకృష్ణ , మంజుల సుధాకర్ , నరేష్ మరియు సచివాలయ సిబ్బంది , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# జ్యుడీషియల్ ఆఫీసర్ల పదవీ విరమణ వయసు పెంపు



**అమరావతి నవంబర్ 30(రిపబ్లిక్ న్యూస్)** రాష్ట్రంలోని న్యాయశాఖ జ్యూడిషియల్ ఆఫీసర్ల( న్యాయాధికారులు ) పదవీ విరమణ వయసును పెంపు చేస్తూ ప్రభుత్వ జీవో ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ తెలిపారు. ఇప్పటివరకు పదవి విరమణ వయసు 60 సంవత్సరాలు కాగా, ఒక సంవత్సరం పెంచి పదవీ విరమణ వయసును 61 గా జీవో జారీ చేయడం జరిగిందని తెలిపారు.

# సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించండి.



## డిసెంబర్ 8న నీటి వినియోగదారుల సాగునీటి సంఘాల ఎన్నిక.

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**నంద్యాల ప్రతినిధి, నవంబర్ 30, రిపబ్లిక్ న్యూస్ ::**
జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సాగునీటి సంఘాల ఎన్నికలు పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణపై నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు పటిష్ట ప్రణాళిక రూపొందించుకొని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. డిసెంబర్ 5 తేదీన సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన వెలువడుతుందన్నారు. డిసెంబర్ 8వ తేదీ నాడు ఎన్నికల ప్రక్రియ వుంటుందన్నారు. కేసి కాల్వ కింద 52, ఎస్సార్బీసీ కింద 50, తెలుగు గంగ కింద 47, శివ భాష్యం ప్రాజెక్ట్ కింద 7, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల కింద 104, మైలవరం కింద ఒకటి వెరిసి మొత్తం 261 నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు సంబంధించిన ఓటర్ల జాబితా సంబంధిత తాసిల్దారుల నుండి తీసుకోవాలన్నారు. ఓటింగ్ నిర్వహించే ప్రదేశాన్ని రైతులందరికీ తెలిసేలా విస్తృత పబ్లిసిటీ ఇవ్వాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ, ప్రాదేశిక సభ్యులు, అధ్యక్ష మరియు ఉపాధ్యక్షులు ఎన్నికలు ప్రక్రియ కూడా అదే రోజు జరుగుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు




జరగకుండా ఎన్నికలను పటిష్టాత్మకంగా తీసుకొని నిర్వహించాలన్నారు. ఏ చిన్న సంఘటన జరిగిన స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఐదు లక్షల ఎకరాలకు పైగా ఇరిగేషన్ ల్యాండ్ ఉందని, నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు బాధ్యతగల అధికారులను నియమించామన్నారు. ఎన్నికలలో నామినేషన్ వేసిన వ్యక్తిని ఎన్నుకోవడానికి రైతులు చేతులెత్తి తమ యొక్క ఆమోదాన్ని తెలపాలన్నారు. 11వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 14వ తేదీన ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంఈవోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో 95.49 శాతం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ పూర్తి.

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల ప్రతినిధి , నవంబర్ 30, రిపబ్లిక్ న్యూస్ ::** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని సాయంత్రం 6 గంటల సమయానికి 95.49 శాతం పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ జి రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం సమీపంలో మంచానికే పరిమితమైన బాలుడు హేమంత్, మరొక పెన్షన్ లబ్ధిదారులైన గాజుల లక్ష్మీదేవికి పింఛన్ మొత్తాలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అందచేశారు. డిసెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే అన్ని మండలాలలో సాయంత్రం 6 గంటల సమయానికి 2,06,836 మందికి 87.49 కోట్ల పెన్షన్ల మొత్తాన్ని పంపిణీ చేసి 95.49 శాతం పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



# పారదర్శకంగా ప్రత్యేక ఓటరు జాబితాను రూపొందించండి.




## ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ కె.కన్నబాబు.

## పారదర్శకంగా ఫిర్యాదుల విచారణ

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల ప్రతినిధి, నవంబర్ 30, రిపబ్లిక్ న్యూస్ ::**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం – 2024లో భాగంగా ఓటర్ల జాబితాను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా రూపొందించాలని ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కె. కన్నబాబు ఈఆర్వోలు, ఏఈఆర్వోలను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం – 2025 లో భాగంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జేసీ విష్ణుచరణ్ లతో కలిసి ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ కె.కన్నబాబు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. టిడిపి తరఫున ప్రసాద్ రెడ్డి, వైఎస్ఆర్సిపి తరపున సాయిరాం రెడ్డి, అలాగే గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ కన్నబాబు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకే ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమంలో స్వీకరించిన క్లైమ్ లు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి ఓటర్ల జాబితాలో పొందుపరచాలన్నారు. దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున జరిగే ఎన్నికల నిర్వహణలో చిన్న తప్పు జరగకుండా ఉండాలంటే ఎన్నికల కమీషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనలు పాటిస్తే తప్పులు జరిగేందుకు అవకాశం ఉండదన్నారు. బిఎల్వోలు క్షేత్రస్థాయిలో 100 శాతం ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. ప్రతి ఓటర్ల జాబితాని పరిశీలన చేయాలని, బిఎల్వోలకు శిక్షణ కూడా ఇవ్వాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకుల ఫిర్యాదులను ముందుగానే అందించాలని, క్షేత్రస్థాయిలో నాయకులకు తెలియజేసి అందరూ సహకరించేలా చూడాలన్నారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి స్వీకరించిన క్లెయిమ్స్, డిస్పోజల్స్ పూర్తి చేయాలన్నారు. ఫ్ర దరఖాస్తులను కమీషన్ నిబంధనలు పాటించి తొలగించాలన్నారు. పూర్తిగా 100 శాతం ప్రతి ఒక్క క్లెయిమ్, అభ్యంతరాలు ఖచ్చితంగా పరిశీలన జరగాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు అందించిన ఫిర్యాదులపై కూడా పరిశీలన తప్పనిసరిగా చేయడం జరుగుతుందని, బిఎల్వోలు మళ్లీ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేస్తారన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా రూపొందించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధుల నుండి అందిన ఫిర్యాదుల విచారణను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేపడుతున్నామన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు క్లెయిమ్స్



పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 13,90,225 మంది ఓటర్లు ఉన్నారని.. ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8కు సంబంధించి 5,326 క్లెయిమ్స్ పెండింగ్లో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. వచ్చిన క్లెయిమ్స్, అభ్యంతరాల ఫిర్యాదులను గ్రామ పంచాయతీ, మండల, నియోజకవర్గ, రెవిన్యూ డివిజన్, జిల్లా స్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి 2025 జనవరి 1వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటరును కూడా తొలగించకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా క్లెయిమ్స్, అభ్యంతరాల విషయమై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు సహకారం అందించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాము నాయక్, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, స్వీప్ నోడల్ అధికారి తదితరులు పాల్గొన్నారు:ౖ ్ర

# కళాశాలలో ర్యాగింగ్, మహిళా సాధికారిత, సైబర్ క్రైమ్ పై అవగాహన



**నంద్యాల క్రైం, నవంబర్ 30, (రిపబ్లిక్ న్యూస్):** ఆర్.జి.ఎమ్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు మహిళా పోలీస్ ఇన్స్పెక్టర్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం సైబర్ క్రైమ్ ర్యాగింగ్ మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

**ర్యాగింగ్**
ఈ అవగాహన కార్యక్రమం నందు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడం అంటే ఒక వ్యక్తిని అవమానించడం లేదా చికాకు బెదిరింపులు మొదలగునవి చేయడం నేరం. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిషేధించడం జరిగిందని ర్యాగింగ్ చేయడం వలన విద్యార్థి జీవితం నాశనం కావడం మాత్రమే కాకుండా మీపై మీ తల్లిదండ్రులు పెంచుకున్న నమ్మకం అడియాశాలుగానే మిగిలిపోతాయి. ఎవరైనా విద్యార్థి ర్యాగింగ్ కార్యకలాపాలకు పాల్పడితే విద్యాసంస్థల నుండి సస్పెండ్ చేయడంతో పాటు డిపార్ట్ చేయడం కూడా జరుగుతుందని తెలియజేశారు.

**మహిళా సాధికారత**
మహిళా సాధికారత అనేది మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు, స్వేచ్ఛలను కల్పించడం. ఇది మహిళల స్వయంప్రతిపత్తి, స్వాతంత్ర్యం, సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించడం. ముఖ్యంగా మహిళలకు విద్యను అందించడం,ఆర్థిక స్వాతంత్ర్యం, ఆర్థిక అవకాశాలను కల్పించడం.రాజకీయలలో ప్రాతినిధ్యం ప్రాతినిధ్యాన్యత కల్పించడం.సామాజిక సమానత్వం సామాజిక సమానత్వాన్ని కల్పించడంమని తెలియజేశారు.

**సైబర్ క్రైమ్**
సైబర్ క్రైమ్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణకు స్వీయ అప్రమత్తతే ముఖ్యమని తెలియజేశారు. ఎవరైనా సైబర్ క్రైమ్ నేరగాళ్ల మాయలో పడి మోసపోతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేసి సహాయం పొందవచ్చు. ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియని వ్యక్తుల నుండి వచ్చే లింకులను ఓపెన్ చేయకూడదని,ఆన్లైన్ లావాదేవీలు చేసే క్రమంలో టెక్నాలజీని వాడుతున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని అత్యాశకు వెళ్లి సైబర్ క్రైమ్ నేరగాళ్ల మాయలో పడవద్దని తెలియజేశారు.



# అవ్వ,తాతల ఆనందమే ప్రభుత్వ లక్ష్యం - ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

## లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**బండి ఆత్మకూరు,నవంబర్ 30,(రిపబ్లిక్ న్యూస్):**– అవ్వ, తాతల ఆనందమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఒకటవ తారీఖున పంపిణీ చేయాల్సిన సామాజిక భద్రతా పెన్షన్ ఒక రోజు ముందుగానే పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు.ఇందులో భాగంగా శనివారం మండలంలోని భోజనం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఆయన స్థానిక టిడిపి నాయకులు, శ్రీశైలం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు బొల్లవరం మల్లేశ్వర రెడ్డితో కలిసి నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులతో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సామాజిక భద్రతా వృద్ధులు, వితంతువులు,ఒంటరి మహిళల పెన్షన్ రూ 4000, వికలాంగులకు రూ 6000 లు అందించడం జరుగుతుందన్నారు.దీంతో అవ్వ,తాతల ముఖాల్లో చిరునవ్వు కనిపిస్తుందన్నారు. అలాగే ఒకటవ తారీకు ఆదివారం సెలవు దినం కావడంతో పింఛన్ అందలేదని నిరాశ,నిస్పృహలతో అవ్వ,తాతలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒక్కరోజు ముందుగానే పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. దీంతో ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల పక్షపాతి అని మరోసారి రుజువయిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలల్లోనే గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు.గత ఐదేళ్ల వైసీపీ పాలన అరాచకం, దాడులు,దౌర్జన్యాలతో రాష్ట్ర



అభివృద్ధి 20 యేళ్లు వెనక్కి వెళ్లిందని ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దస్తగిరితో పాటు పంచాయతీ సెక్రెటరీ చంద్ర నాయక్, వెల్ఫేర్ అసిస్టెంట్ నర్మద,టిడిపి నాయకులు లాయర్ కృష్ణారెడ్డి,మహేశ్వర రెడ్డి, సుధాకర్ రెడ్డి,బాలకృష్ణ,రేగటి రాజశేఖర్ రెడ్డి,బుగ్గ రాముడు,జాకీర్ ఖాన్, మలిరెడ్డి భాస్కర్ రెడ్డి, శివప్రసాద్,జనసేన నాయకులు సురేష్,చాంద్ బాషా వివిధ గ్రామాల టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల పట్టణంలో 6 వ వార్డు జగజ్జనని నగర్ లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మరియు తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ గారు.

## ఒక్కరోజు ముందుగానే ఫింఛన్లు పంపిణీ చేయడం పట్ల తమ సంతోషం వ్యక్తం చేస్తున్న అవ్వా తాతలు ,లబ్ధిదారులు.

## పేదల ముఖంలో ఆనందం చూడడమే కూటమి ప్రభుత్వం ధ్యేయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ , తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్

**నంద్యాల నవంబర్ 30 (రిపబ్లిక్ న్యూస్):**
పట్టణం 6 వ వార్డు జగజ్జనని నగర్ లో లబ్ధిదారులు ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా ఫించన్లను
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ , తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ శనివారం పంపిణీ చేశారు.



. రాష్ట్రంలోని ప్రతి ఒక్క పేదవాని ముఖంలో ఆనందం చూడడమే ప్రభుత్వ ధ్యేయమని అందుకు తగ్గట్టుగా ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛను అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పింఛన్లు పంపిణీ చేసామని తెలిపారు. దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు ఇలా ప్రతి ఒక్కరికి పింఛన్లు అందించి వారికి అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందనీ, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిందని అయినా కూటమి ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపించేందుకు తీవ్రస్థాయిలో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఖాజా హాఫిజ్, తెలుగుదేశం పార్టీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రషీద్, అమీర్ వినోద్ మొదలైన వారు పాల్గొన్నారు

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com